క్లుప్తంగా

ఢిల్లీకి తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

మరికల్: దశాబ్దాల కల ఎస్సీ వర్గీకరణ కావడంతో ఎమ్మార్పీఎస్ నాయకులు ఢిల్లీలో జరిగే కృతజ్ఞత సభకు తరలివెళ్లారు. మండల కేంద్రంలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ నెల 6న ఢిల్లీలో ఏర్పాటు చేసిన కృతజ్ఞాత సభకు మండలం నుంచి 200 మంది తరలివెళ్లారు. బాల్‌రాజ్, రామస్వామి, గోపాల్, రాజు, రాజేష్, కొండన్న, శాంతన్న ఉన్నారు.

చెక్కు అందజేత

ఊట్కూరు: మండలంలోని కొత్తపల్లికి చెందిన హనుమంతుకు కార్మిక శాఖ ద్వారా మంజూరైన రూ.1.30లక్షల చెక్‌ను ఆదివారం బీఎంఎస్ నాయకుడు నర్సింహులు అందించారు. ఇటీవల నర్సింహులు భార్య జయమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. వీరి కుటుంబానికి కార్మిక శాఖ గుర్తింపు కార్డు ఉండడంతో బీమా మంజూరు అయినట్లు నాయకులు తెలిపారు.

కేంద్ర మంత్రిని కలిసిన నాయకులు



మక్తల్: కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌ను రాష్ట్ర ఓబీసీ బీజేపీ అధికార ప్రతినిది రవి కుమార్ ఆదివారం ఢిల్లిల్లో కలిశారు. తమకు ఎస్సీ సర్టిఫికేట్ అందజేసి కుర్వలకు న్యాయం చేయాలని కోరారు.

కరపత్రం విడుదల



మక్తల్: ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ పార్టీ నాయకుడు కిరణ్ డిమాండ్ చేశారు. ఆదివారం 8వ తేదీన కలెక్టరేట్ ఎదుట చేపట్టనున్న ధర్నా కరపత్రం విడుదల చేశారు. హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, భాస్కర్, అశోక్, రవి, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమా నమోదు చేసుకోండి

మద్దూరు: రైతుబీమా నమోదు సోమవారంతో ముగుస్తుందని, కొత్త పట్టదారు పాసుపుస్తకాలు వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి రామకృష్ణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మండలంలో 2023లో 87 మంది రైతులు చనిపోగా, అందులో 74 మంది క్లెయిమ్స్ పరిష్కరించడినట్లు తెలిపారు.

ముమ్మరంగా వరినాట్లు



కృష్ణా: మండలంలో విస్తారంగా వర్షాలు కురువడంతో గ్రామాల్లో వరి నాట్లు ముమ్మరం చేశారు. జాతీయ రహదారి పక్కన ఉన్న గుడెబల్లూర్ శివారులో గల బుడ్డమోళ్ల రాము పొలంలో ఆదివారం వరి నాట్లు వేశారు. కాగా తల్లి దండ్రులు పొలంలో పనులు చేస్తున్న సమయంలో వారి కుటుంబానికి చెందిన చిన్నారులు పాఠశాలకు ఆదివారం సెలవు కావడంతో సరదాగ పొలంలో పనులు చేశారు.

విరాళాల సేకరణ

దామరగిద్ద: కేరళ రాష్ట్రంలోని వాయినాడ్ జిల్లాలో వరదల ధాటికి నిరాశ్రయులైన వరద బాధితుల సహాయార్థం ఆదివారం సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో విరాళాల సేకరణ చేపట్టారు. మండల కార్యదర్శి గోపాల్, ప్రకాష్, మల్లేష్, కాశప్ప తదితరులు పాల్గొన్నారు.

వెలగని వీధిలైట్లు

నర్వ: మండల కేంద్రంలోని ఊరి బయటి ఆంజనేయస్వామి కాలనీ, బీసీ కాలనీల్లో వీధి లైట్లు వెలగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కాలనీ వాసులు వాపోతున్నారు. కొన్ని రోజులుగా కాలనీలోని చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. అసలే వర్షాకాలం కావడంతో విష సర్పాలు సంచరిస్తుండడంతో భయంగా ఉందన్నారు. దీనిపై కార్యదర్శి, ప్రత్యేక అధికారులు చొరవ చూపి వెంటనే కాలనీల్లో వెలగని బల్బులను మార్చాలని కోరుతున్నారు.

ఇన్‌చార్జీల పాలన ఎన్నాళ్లు?



కొత్తపల్లి లోపించిన పారిశుధ్యం

- మాగనూరుకు అధికారులు కరువు
- సకాలంలో అందని సేవలు



మాగనూర్‌లో ఇలా..

మాగనూర్: మండలం అభివృద్ధికి నోచుకోవడం లేదు. ముఖ్యశాఖలు ఏళ్లుగా ఇన్‌చార్జీల పాలనలోనే కొనసాగుతున్నాయి. అధికారులపై ఇతర మండలాల బాధ్యతలు ఉండటంతో ఎప్పుడు వచ్చి వెళ్తున్నారో తెలియడం లేదని ప్రజలు అంటున్నారు. దీంతో వివిధ పనుల నిమిత్తం మండల కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. జిల్లాలో ఉన్నత అధికారులు స్పందించి మండలంలో ఇన్‌చార్జీల పాలనకు ముగింపు పలికి రెగ్యులర్ అధికారులను నియమించి ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు వేడుకుంటున్నారు.

ఖాళీగా ఉన్న పోస్టులు ఇవే..

ఎంపీడీఓ, ఎంపీఓ, వ్యవసాయశాఖలో ఏఓ, ఎంఈఓ, ఈజీఎస్ ఏపీఓ, రెగ్యులర్ ప్రభుత్వ వైద్యాధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలో పంచాయతీ అభివృద్ధిలో కీలక పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అంతకుముందు ఇక్కడ విధులు నిర్వహించిన కొందరిని ఇతర మండలాలతో పాటు కలెక్టర్ కార్యాలయానికి డిప్యూటేషన్, బదిలీలు చేశారు. మండలంలోని ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తున్న శశికళ ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఎంపీఓ జైపాల్‌రెడ్డికి రెండు బాధ్యతలు అప్పగించారు. అయితే ఆయన కూడా ఇటీవల బదిలీపై వెళ్లడంతో ఇక్కడ ఎంపీఓ, ఎంపీడీఓ పోస్టులు ఖాళీగా మారాయి. దీంతో కృష్ణ మండల ఎంపీఓ విజయలక్ష్మికి ఇన్‌చార్జిగా బాధ్యతలు అప్పగించారు. వ్యవసాయాధికారిగా హరిత విధులు నిర్వహిస్తుండగా ఆమె కొన్ని నెలల క్రితం సెలవులపై వెళ్లింది. దీంతో కృష్ణ మండలం ఏఓ సుదర్శన్‌గౌడ్‌కు అదనపు బాధ్యతలు ఇవ్వడంతో ఒకరోజు ఇక్కడ, మరో రోజు అక్కడ విధులు నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

విద్యా వ్యవస్థలోనూ అంతే..

ప్రస్తుత మండల ఇన్‌చార్జి ఎంఈఓగా విధులు నిర్వహిస్తున్న గోపాల్‌నాయక్ ఏకంగా పది మండలాలకు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కొన్ని నెలల క్రితం ఎంఈఓ వెంకటయ్య ఉద్యోగ విరమణ పొందడంతో ఈయనకు మాగనూర్ ఇన్‌చార్జి బాధ్యతలు ఇవ్వడంతో ఐదు మండలాలకు తానే ఇన్‌చార్జి కావడంతో వారానికి ఒక్కో మండలానికి ఒకసారి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వైద్యాధికారి కూడా..

మండలంలో 24 గంటల ఆరోగ్య సేవలు ఉండటంతో ఇక్కడ ఇద్దరు వైద్యాధికారులు అవసరం ఉంది. ఒక్కరు కూడా రెగ్యులర్ వైద్యులు లేరు. ఉన్న ఒక్కరు కాంట్రాక్ట్ బేసిక్ దీంతో వైద్య సేవల కోసం మండల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇబ్బందులను ఎదుర్కొంటున్నాం..



మండలంలో ఎన్నో రోజులుగా ముఖ్య శాఖల అధికారుల బాధ్యతలు ఇన్‌చార్జిలకు ఇవ్వడంతో అనేక ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇప్పటికైనా స్పందించి పూర్తిస్థాయి అధికారులను నియమించాలి.

– ఆంజనేయులు, సీఐటీయూ జిల్లా కోశాధికారి

అవగాహన కరువైంది..



మండల కేంద్రంలో వ్యవసాయ శాఖ అధికారి లేక ఇబ్బంది పడుతున్నాం. పంటలు దెబ్బతింటే చెప్పుకుందామని కార్యాలయానికి పోదామంటే దూరం అవుతుంది. ఇప్పటికైనా మండల వ్యవసాయ అధికారిని నియమించాలని కోరుతున్నాం.

– పల్లె మారెప్ప

సమస్య పరిష్కరించాలి



ప్రస్తుతం ఇన్‌చార్జిల మండలంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే ఉద్యోగులంతా ఇన్‌చార్జిలు అయితే మండల అభివృద్ధి ఎలా సాధ్యపడుతుంది. జిల్లాస్థాయి అధికారులు స్పందించి వెంటనే మండలానికి రెగ్యులర్ అధికారులను నియమించి, ప్రజలకు పూర్తిస్థాయిలో సేవలు అందేలా చూడాలి.

– శ్యామలమ్మ, మాజీ ఎంపీపీ, మాగనూర్

హడలెత్తిస్తున్న వీధి కుక్కలు



నేరడగంలో గుంపులుగా సంచరిస్తున్న కుక్కలు

మాగనూర్: మండలంలోని నేరడగంలోని అన్ని వార్డుల్లో వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తున్నాయి. గుంపులుగా సంచరిస్తుండడంతో భయాందోళనకు గురవుతున్నారు. వీధి కుక్కలే కదా అనుకుని పక్క నుంచి వెళ్దామనుకుంటే ఎక్కడ దాడి చేస్తాయో అని చిన్నారులు, పెద్దలు జంకుతున్నారు. కార్లు, ద్విచక్ర వాహనాలను వెంబడిస్తున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి కుక్కలను వేరే ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కృష్ణమాచారిని సన్మానిస్తున్న అధికారులు

బదిలీలు సహజం

నారాయణపేట: ప్రతి ఉద్యోగికి బదిలీ సహజమని విధి నిర్వహణలో పనిచేసి మంచి గుర్తింపు పొందాలని ఇన్‌చార్జి జెడ్పీ సీఈఓ రాజేశ్వరి అన్నారు. బీసీ అభివృద్ధి అధికారి కృష్ణమాచారి ఖైరతాబాద్‌కు బదిలీ అయిన సందర్భంగా ఆదివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్, పీఆర్‌టీయూ అధ్యక్షుడు జనార్దన్ రెడ్డి, బీసీ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్లు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా పాఠశాల భవనం



పాఠశాల భవనం

మాగనూర్: మండలంలోని మందిపల్లిలోని పాత పాఠశాల భవనం నిరుపయోగంగా ఉందని దానిని వినియోగంలోకి తీసుకొచ్చి అంగన్‌వాడీ లాంటి కేంద్రాలకు కేటాయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. ప్రస్తుతం ఉన్న పాఠశాలలో 250 మందికి పైగా విద్యార్థులు ఉండగా కేవలం మూడు మాత్రమే తరగతి గదులు ఉన్నాయని అందులో ఓ గది శిథిలావస్థకు చేరుకుందని తెలిపారు. మిగిలిన రెండు గదుల్లో ఒకదాంట్లో అంగన్‌వాడీ కేంద్రం నడుస్తుండటంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, అధికారులు స్పందించి నిరుపయోగకరంగా ఉన్న పాత పాఠశాల భవనంను వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.

యూజీడీ పనుల పరిశీలన



అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక తొమ్మిదో వార్డు పరిధిలోని మరుల్లో కొనసాగుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ (యూజీడీ) పనులను ఆదివారం మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ పరిశీలించారు. కాగా, ఈ కాలనీ మీదుగా మురుగు, వరద నీరు సాఫీగా ముందుకు వెళ్లేందుకు ఈ పనులు చేపడుతున్నారు. అంతకుముందు అశోక్‌టాకీస్ చౌరస్తా సమీపంలో అయ్యప్పస్వామి ఆలయ అన్నదాన మండపాన్ని ప్రారంభించారు. అనంతరం అయ్యప్పస్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్లు మూషా నరేందర్, రామ లక్ష్మణ్, ఆలయ కమిటీ సభ్యులు సీమ నరేందర్, పీఈటీ రమేశ్, వనగంటి శంకర్, పీట్ల యాదయ్య, సతీష్, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ప్రారంభం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 4వ వార్డు పరిధిలోని ఎదిరలో, 11వ వార్డులోని పాతపాలమూరులో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను ఆదివారం రాత్రి మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కాంగ్రెస్ నాయకులు ఫయాజ్, నర్సింహ, చెన్నయ్య, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన యువతి



తొగటి శివాణి

ఊట్కూరు: మండల కేంద్రానికి చెందిన తొగటి శివాణి మూడు ప్రభుత్వ ఉద్యోగాలను సాధించింది. ఇటీవల విడుదలైన పీజీపీఎస్‌సీ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి మిషన్ భగీరథ శాఖలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉద్యోగానికి ఎంపికైంది. ఈమె ఎస్‌బీఐ జూనియర్ అసిస్టెంట్‌గా నెల రోజులు క్రితం ఉద్యోగంలో చేరింది. టీపీబీఓ పరీక్షల్లో కూడా ఉద్యోగం సాధించడం విశేషం. ఒకే సమయంలో మూడు ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల పలువురు అభినందిస్తున్నారు.


చేపపిల్లల సరఫరా బిల్లులు చెల్లించండి



ఆత్మకూర్: రాష్ట్ర ప్రభుత్వ మత్స్యశాఖ ద్వారా నిర్వహించిన ఉచిత చేపపిల్లల పంపిణీకి సంబంధించి సరఫరా బిల్లులు ఇప్పించాలని చేపపిల్లల ఉత్పత్తి రైతులు మత్స్యశాఖ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ వేణుగోపాల్, ఏటికాడి ఆనంద్ అన్నారు. ఆదివారం మండలంలోని ఆరేపల్లిలో చేపల పెంపకందారులు సమావేశమయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా 77 మంది రైతులకు రూ.74.16 కోట్లు బిల్లులు రావాల్సి ఉందని, పక్క రాష్ట్రంలో విద్యుత్ వినియోగానికి ఒక్క యూనిట్‌కు రూ.2.78 కాగా, తెలంగాణలో రూ.7.20 ఉందని అన్నారు. సకాలంలో బిల్లులు అందక ఇబ్బందులు పడుతున్నామని, ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లించి టెండర్లు నిర్వహించాలని కోరారు.

మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్‌కు

- కింగ్‌షోటోకాన్ విద్యార్థులు



మహబూబ్‌నగర్ క్రీడలు: హైదరాబాద్‌లోని గచ్చిబౌలీ ఇండోర్ స్టేడియంలో ఈనెల 11న డ్రాగన్ కుంగ్‌ఫూ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ చీఫ్ ఆర్గనైజర్ భీమా ఉదయ్ ఆధ్వర్యంలో జరిగే ఇంటర్నేషనల్ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో.. కింగ్‌షోటోకాన్ కరాటే విద్యార్థులు పాల్గొంటున్నట్లు ఫౌండర్ జహంగీర్‌పాష ఖాద్రీ తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మహాత్మాగాంధీ రోడ్డు స్కూల్ ఆవరణలో విద్యార్థులను జహంగీర్‌పాష ఖాద్రీ అభినందించారు. టోర్నీలో ప్రతిభ కనబరిచి పతకాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఆలయానికి ప్లేట్ల వితరణ

మక్తల్: మండలంలోని కర్ని గ్రామంలో లింగమయ్యస్వామి ఆలయానికి యువకుడు కటికలి లింగప్ప 50 ప్లేట్లను ఆదివారం అందజేశారు. ప్రతి నెల అమావాస్య రోజు ఆలయంలో భక్తులకు అన్నదానం నిర్వహిస్తారు. ఇందుకోసం ప్లేట్లు అందజేసినట్లు తెలిపారు.

మంత్రికి వినతుల వెల్లువ



దేవరకద్రలో మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్మికులు

దేవరకద్ర/చిన్నచింతకుంట : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం మంత్రి జూపల్లి కృష్ణారావుకు గ్రామ పంచాయతీ కార్మికులు వినతి పత్రం ఇచ్చారు. దేవరకద్ర మీదుగా కోయిల్ సాగర్ వెలుతున్న మంత్రికి వారు వినతి పత్రం ఇచ్చి తమ గోడు చెప్పుకున్నారు. వెంకటన్న, బాల్‌రాజు, కిష్టన్న తదితరులు ఉన్నారు. అదేవిధంగా పారిశుద్ధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ చిన్నచింతకుంట మండలపరిధిలో సోమవారం కురుమూర్తి స్వామి ఆలయం వద్ద తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయితీ వర్కర్స్ యూనియన్ నాయకులు మంత్రి జూపల్లి కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, జేఎస్ దేవదానం, కార్యదర్శి సాంబశివుడు, జిల్లా కోశాధికారి గణేష్, పంచాయితీ కార్మికులు కుర్మన్న, శ్రీను, రవి పాల్గొన్నారు.

నిధులివ్వాలని..

అడ్డాకుల: మండలంలోని కందూర్ రామలింగేశ్వరస్వామి ఆలయానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. ఆదివారం కురుమూర్తిస్వామి దేవాలయం వద్ద వినతిపత్రం అందజేశారు.

చౌడేశ్వరిమాత జయంతి వేడుకలు



కోస్గిలో పూజలు చేస్తున్న భక్తులు



మద్దూరులో దోలారోహణం నిర్వహిస్తున్న భక్తులు

కోస్గి: పట్టణంలోని చౌడేశ్వరిదేవి జయంతిని పురస్కరించుకుని తొగుట వీర క్షత్రీయ సమాజం ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇసుక బావి ఒడ్డున ఉన్న అమ్మవారి ఆలయంలో ఆదివారం అభిషేకం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. ఈ సందర్భంగా మహిళలు అమ్మవారికి కుంకుమ కుంకుమార్చన చేశారు.

మద్దూరు: మండల కేంద్రంలోని చౌడేశ్వరీ దేవాలయంలో శ్రావణమాస అమావాస్యను పురస్కరించుకుని ఆదివారం తొగుట వీర క్షత్రియుల ఆధ్వర్యంలో అమ్మవారి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చాన, డోలారోహణం చేశారు.

మరికల్: మండల కేంద్రంలోని ఆలయాల వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం అమావాస్య కావడంతో ఆంజనేయ, ఈశ్వర శివాలయాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అలగే ఆదిహన్మన్ల వద్ద కూడా పూజలు చేశారు. అనంతరం గ్రామస్తులకు పలు దేవాలయ వద్ద తీర్థప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

మొక్కలు నాటిన పూర్వవిద్యార్థులు



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న పూర్వ విద్యార్థులు

మద్దూరు: స్నేహితుల దినోత్సవాన్ని పురస్కరించుకుని తాము చదువుకున్న పాఠశాలలో స్నేహితులందరూ కలిసి ఆదివారం మొక్కలు నాటారు. 2002–03 పదో తరగతి బ్యాచ్ చెందిన పూర్వ విద్యార్థులందరూ బాలికల ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో ఈ సందర్భంగా కలిశారు. నాటిన మొక్కలను పూర్వ విద్యార్థులంతా సంరక్షిస్తామన్నారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గోపాల్, రామకృష్ణ, సిద్దు, శ్రీనివాస్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నపొర్లలో పోలీసుల ఫ్లాగ్‌మార్చ్



ఫ్లాగ్‌మార్చ్‌లో పాల్గొన్న పోలీసులు

ఊట్కూరు: మండలంలోని చిన్నపొర్ల, పెద్దపొర్లలో ఆదివారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఎస్ఐ నవీన్ మాట్లాడుతూ గ్రామాలలో ఎలాంటి ఘర్షణలు, అవాంఛనీయ ఘటనలు కాకుండా ప్రజల భద్రతపై భరోసా కల్పించడానికి కవాతు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమంలో కిశోర్‌కుమార్‌రావు, సిబ్బంది రవింద్రారోశన్, రాజు, పాల్గొన్నారు.

వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోండి



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

మరికల్: వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకులు కొండయ్య, చంద్రకాంత్‌గౌడ్, రాజేష్ అన్నారు. మరికల్ యువక మండలి భవనంలో ఆదివారం నిర్వహించిన ఆక్యుప్రెషర్, మ్యాగ్నటిక్, సుజోక్ వైబ్రేషన్ చికిత్స శిబిరాన్ని వారు ప్రారంభించారు. కేవలం రూ. వంద ఫీజుతో ఆరు రోజుల పాటు అన్ని రకాల వ్యాధులకు చికిత్స చేస్తామని డాక్టర్లు దేవేందర్, కైలాష్ చౌద్రి తెలిపారు. కార్యక్రమంలో రవికిరణ్, రఘు, బసంత్, గోపాల్, కృష్ణయ్య, రాజు, సూర్యప్రకాష్‌లు పాల్గొన్నారు.

నిరుపయోగంగా రైతు బజార్లు



వర్షంలో సంత నిర్వహిస్తున్న వ్యాపారులు



తాళం పడిన ధన్వాడ రైతుబజారు



కిష్టాపూర్ రైతుబజారు

ధన్వాడ: రైతులు అమ్మకాలు చేసుకునేందుకు నిర్మించిన రైతుబజార్లు నిరుపయోగంగా మారాయి. మండల కేంద్రంలోని పాత తహసీల్దార్ కార్యాలయం వద్ద రైతు బజారును రూ.22లక్షలు వెచ్చించి నిర్మించారు. మండల కేంద్రంలో సంత ప్రతి గురువారం నిర్వహిస్తారు. ఇందులో జిల్లా వ్యాప్తంగా వ్యాపారులు, రైతులు వారి కూరగాయలు, ఇతర వస్తువులను అమ్మకాలకు వస్తుంటారు. దాదాపు 150కి పైగా రైతులు ఇక్కడ అమ్మకాలు చేసేందుకు వస్తారు. రైతుబజారును స్థలం చిన్నగా ఉండంతో 50 మందికి వరకు మాత్రమే అమ్మకాలు చేసే విధంగా నిర్మాణం చేశారు. దీంతో స్థలం సరిపోక రోడ్లపై అమ్మకాలు చేస్తున్నారు. వచ్చే కొనుగోలుదారులకు రోడ్డుపై వ్యాపారం చేసే వారితోనే కొంటున్నారు. తమకు గిరాకీ అవ్వడం లేదంటూ రైతుబజారు ప్రారంభించిన రోజే రైతులు మార్కెట్ నుంచి బయటికి వచ్చి అమ్మకాలు చేసుకున్నారు. మండలంలో కిష్టాపూర్‌లో రూ.13.54లక్షలతో రైతు బజారును నిర్మించారు. ఇక్కడ కూడా నిరుపయోగంగానే ఉంది. గ్రామానికి శివారులో నిర్మాణం చేపట్టారు. ప్రజలు ఎవరూ అటువైపు కొనుగోళ్లకు రాకపోవడంతో రైతుబజారుకు తాళం పడింది.

అద్దెకు ఇస్తే పంచాయతీకి నిధులు

ధన్వాడ రైతు బజారులో అమ్మకాలు చేసేందుకు వ్యాపారులకు కేటాయిస్తే రోజు అమ్మకాలు చేయడంతో పాటు సంత రోజు కూడా వ్యాపారులు అమ్మకాలు చేసేందుకు వీలుంటుందని గ్రామస్తులు అంటున్నారు. అంతే కాకుండా పంచాయతీకి నిధులు కూడా ప్రతి నెల సమకూరుతాయని, అధికారులు ఎందుకు ఈ దిశగా ప్రయత్నాలు చేయడం లేదని ప్రశ్నిస్తున్నారు.

వర్షంలో ఇబ్బందులు



రైతుబజారులో ఒక రోజు అమ్మకాలు చేయాలని పంచాయతీ వారు తెలిపారు. అమ్మకాలు చేసేందుకు వెళ్లాం. కాని కొంతమంది బయట కూర్చొని అమ్మకాలు చేస్తున్నారు. దీంతో రైతుబజారు లోపలికి వచ్చే కొనుగోలుదారుల సంఖ్య తక్కువ ఉంది. దీంతో చేసేదిలేక మేము కూడా రోడ్డువైపు వచ్చి అమ్మకాలు చేస్తున్నాం.

– లక్ష్మి, గూరకొండ